# సర్వే డాటా ఆన్‌లైన్ ఎంట్రీ కీలకం

- ఎక్కడా పొరపాట్లకు తావివ్వద్దు
- వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

జగిత్యాల, నవంబర్ 24: 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటున్నది. ఈ క్రమంలో సేకరించిన సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ చాలా కీలకమైంది. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా చూడాలి' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి సర్వేపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సర్వేలో చేస్తున్న టైంలో డోర్ లాక్ ఉన్న కుటుంబాలకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, అందుబాటులో ఉండాలని సూచించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వలస వెళ్లిన కుటుంబాల వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు కాకుండా చూడాలని, ఆహారం, పరిశుభ్రత పై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందని చెప్పారు. వీసీలో కలెక్టర్ సత్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్

## ఎమ్మెల్సీ కవితను కలిసిన మండల నాయకులు

సారంగాపూర్, నవంబర్ 24: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జరిగిన జగిత్యాల నియోజక వర్గ నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ ఎంపీపీ కొల్ముల శారద, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు తేలు రాజు, నేరేళ్ల సుమన్ గౌడ్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24: మంత్రివర్గ ఉపసంఘం వెంటనే ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ కోరారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 317బాధితులకు న్యాయం చేకూర్చేలా క్యాబినెట్ సబ్‌కమిటీ నివేదిక సమర్పించిందని, బదిలీ ఉత్తర్వు వెలువడడంలో ఆలస్యం కావడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొన్నదన్నారు. గత వేసవిలో ఎస్సెస్సీ స్పాట్ వాల్యుయేషన్ రెమ్యునరేషన్ ఇంతవరకు చెల్లించలేదన్నారు. కులగణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్స్ అందజేయాలని, రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు కాజా మంజూర్ అలీ, కార్యక్రమ సంధానకర్త ప్రధాన కార్యదర్శి అశోక్‌రావు, ముఖ్య అతిథులు రాష్ట్ర కన్వీనర్ శుంకిశీల ప్రభాకర్‌రావు, కొత్త దయాకర్, మధుచంద్ర, అబిబుర్ రహమాన్, సలీం, భద్రయ్య, లతీఫ్, మోఈజ్, అరవింద్, దివాకర్, ఉపేందర్, అనిల్, రామారా వు, శర్మ తదితరులు ఉన్నారు.

## విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడానికి కృషి

- ట్రస్మా స్టేట్ అడ్వయిజర్ యాదగిరి శేఖర్‌రావు

మానకొండూర్, నవంబర్ 24: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా కృషిచేయాలని ట్రస్మా స్టేట్ అడ్వయిజర్ యాదగిరి శేఖర్‌రావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని చాణక్య ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఎడ్యుకేషన్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. ఇక్కడ కరస్పాండెంట్ ఆడెపు రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

# వీడని అలకలు, అసంతృప్తులు!

- సాదాసీదాగా బాధ్యతలు చేపట్టిన మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్
- ప్రమాణస్వీకారం చేయని మిగతా పాలకవర్గం సభ్యులు
- జువ్వాడి వర్గంలో కొనసాగుతున్న నైరాశ్యం

మెట్‌పల్లి, నవంబర్ 24: మెట్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియామకంతో నెలకొన్న అలకలు, అసంతృప్తులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కొత్త పాలకవర్గాన్ని ప్రకటించి 15 రోజులు కావస్తున్నా చైర్మన్ మినహా పాలకవర్గం సభ్యులు ఇప్పటి వరకు ఎవరూ ప్రమాణస్వీకారం చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్త పాలకవర్గం నియామకానికి సంబంధించి కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్‌రావు మధ్య పోరు కొనసాగిన విషయం తెలిసిందే. ప్రధానంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తమ వర్గీయులకు ఇప్పించుకునేందుకు జువ్వాడి, కల్వకుంట్ల నడుమ పోటీ రసవత్తరంగా సాగింది. చివరకు సుజీత్‌రావు ముఖ్య అనుచరుడైన కూన గోవర్ధన్‌కు ఆ పదవి దక్కింది. జువ్వాడి తన అనుయాయుడైన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డికి చైర్మన్ పదవీ ఇప్పించుకునేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. చైర్మన్ పదవి ఆశించిన అంజిరెడ్డికి వైస్‌చైర్మన్ పదవితో పాటు మెజార్టీ డైరెక్టర్ పదవులు జువ్వాడి వర్గానికే దక్కాయి. మరో వైపు చైర్మన్ పదవి తమకే రావడంతో సుజీత్‌రావు వర్గంలో కొత్త ఉత్సాహం నింపగా, నర్సింగరావు వర్గంలో మాత్రం నైరాశ్యం నెలకొంది. చైర్మన్ పదవి ఆశించి భంగపడ్డ అంజిరెడ్డి మాత్రం ఇంకా అలక వీడడం లేదు. అదే దారిలో మరి కొందరు డైరెక్టర్లుగా నియమితులైన వారు కూడా ఉన్నట్లు సమాచారం. కాగా వైస్‌చైర్మన్‌గా నియమితులైన అంజిరెడ్డి తాను ఆ పదవితో సరిపెట్టుకోవాలా..? లేదా వదులుకోవాలా..? అన్న మీమాంసలో పడినట్లు తెలుస్తోంది. మరో వైపు అట్టహాసంగా ప్రమాణస్వీకారోత్సవం నిర్వహిస్తారని మొదటగా ప్రచారం జరిగినా సాదాసీదాగా చైర్మన్‌గా గోవర్ధన్ ఒక్కరే ఈ నెల 14న బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. మంచి ముహూర్తం మరో రోజు అట్టహాసంగా ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఉంటుందని మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితర మంత్రులు ఆ కార్యక్రమానికి హాజరవుతారని సుజీత్‌రావు వర్గీయులు చెప్తున్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం ఈ రెండు వర్గాల మధ్య రేపిన చిచ్చు సమసిపోతుందా? లేదా అలకలతో రాజీనామాలకు దారితీస్తుందా?, మరో వైపు పాలకర్గంలో రెండు వర్గాలకు ప్రాతినిధ్యం కలిగిన పాలకవర్గం సభ్యుల నడుమ సయోధ్యతో ఏకతాటిపై నిలబడుతుందా? లేదా వర్గ విభేదాలతోనే పాలకవర్గం ముందుకు కొనసాగుతుందా? అనే సందేహాలు అప్పుడే రేకెత్తుతున్నాయి.

## కొయ్యకాలు కాల్చితే రైతుకు నష్టం

- డీఏవో రాంచందర్
- రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన

జగిత్యాల టౌన్, నవంబర్ 24: రైతులు వరి కోత తర్వాత కొయ్యకాలును కాల్చడం వల్ల పంటకు అధిక నష్టం జరుగుతుందని డీఏవో రాంచందర్ పేర్కొన్నారు. ధరూర్, నర్సింగాపూర్ గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, కొయ్యకాలును కాల్చడం వల్ల జరిగే అనర్థాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అధిక వేడి వల్ల భూమిలోని నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు ఆవిరైపోయి నేల గుల్లగా మారుతుందని, పంటల దిగుబడి తగ్గిపోతుందని చెప్పారు. నేలలోని పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోతాయని, పంటకు తెగుళ్లు, కీటకాల ఉధృతి పెరుగుతుందన్నారు. కొయ్య కాలు కాల్చకుండా భూమిలోనే కలియ దున్నడం వల్ల భూసారం పెరిగి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఇక్కడ మండల వ్యవసాయ అధికారి బీ వినీల, విస్తరణ అధికారి నాగరాజు ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

## కవులు సామాజిక నిర్దేశకులు



కవి సాయంత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24: సమాజాన్ని సక్రమమార్గంలో పెట్టే విజ్ఞత కవులకే ఉంటుందని, వారే సమాజ నిర్దేశకులని తెలంగాణ బీసీ వెల్ఫేర్ స్కూల్స్ సంయుక్త సంచాలకుడు జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. ఆదివారం 'కవి సాయంత్రం' సోషల్ మీడియా గ్రూప్ ఆత్మీయ సమ్మేళనం స్థానిక వివేకానంద పాఠశాలలో నిర్వహించగా, శ్యామ్ ప్రసాద్‌లాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కవి సాయంత్రం ద్వారా సోషల్ మీడియాలో పరిపుష్టమైన కవిత్వాన్ని అందిస్తున్నారని చెప్పారు. ఇందులోని కవులు ప్రౌఢ సాహిత్యాన్ని అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికగా ఇలాంటి బృహత్కార్యాన్ని చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం కవులను సన్మానించారు. ఇక్కడ ప్రముఖ కవులు అన్నవరం దేవేందర్, నంది శ్రీనివాస్, ఉద్యమ గాయని వొల్లాల వాణి, సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్‌కుమార్, వివేకానంద పాఠశాలల చైర్మన్ సొగాని కొమురయ్య, కవులు దేవర కనకయ్య, ఎడెల్లి రాములు, మధు మురళి, కవిత భేతి, డాక్టర్ మాలతీలత, నలంద దాస్ ఉన్నారు.

## వైభవంగా గంగామాత తెప్పోత్సవం



జగ్గసాగర్ పెద్దచెరువులో గంగామాత తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 24: జగ్గసాగర్ గ్రామంలో ఆదివారం రాత్రి గంగామాత తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. గంగామాత ఆలయ 14వ వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం నిత్యహోమం, బలిహరణం, పల్లకీసేవ, తీర్థప్రసాద వినియోగం, గత స్థాపిత దేవతార్చన పూజలు చేశారు. రాత్రి విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన పడవలో గంగామాత ఉత్సవమూర్తులను ఉంచి స్థానిక పెద్దచెరువులో తిప్పుతూ తెప్పోత్సవం జరిపారు. భక్తులు అధి సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

- ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్



మాట్లాడుతున్న తెలంగాణ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాన్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్

తెలంగాణచౌక్, నవంబర్24: ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాన్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశ మందిరంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మద్దె రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో ఆటోలకు గిరాకీ రాక డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల్లో ఉచిత ప్రయాణాన్ని అమలుచేసిన ప్రభుత్వం మిగతా హామీలను ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉచిత ప్రయాణ పథకానికి తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ ఆటోల తో జీవనోపాధి పొందుతున్న లక్షలాది ఆటో డ్రైవర్లు ఇంటి కిరాయిలు, పిల్లల ఫీజులు, ఆటోల ఈఎంఐలు చెల్లించలేక ఆత్మహత్మలకు పాల్పడుతున్నారని వాపోయారు. తమను ఆదుకోవాలని పలుమార్లు మంత్రులు, ఎమ్మెల్యేలకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసి ఏడాది కావస్తున్నా.. ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు ప్రతినెల ₹15 వేల జీవనభృతి, మృతిచెందిన డ్రైవర్ల కుటుంబానికి ₹15లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆటో ఫైనాన్స్ కంపెనీల నుంచి వేధింపులకు ఆపాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం, భవిష్యత్ పోరాటాల గురించి వచ్చే నెల 22న జిల్లా కేంద్రంలో నిర్వహించే సదస్సుకు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, అధికార ప్రతినిధి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షు డు శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ ఉన్నారు.

# ఆకర్షణీయ సిబిల్ స్కోర్‌కు ఆరు సూత్రాలు




పర్సనల్ ఫైనాన్స్‌లో మూడంకెల క్రెడిట్ స్కోర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మన దేశంలో వ్యక్తులు, కంపెనీల రుణ పరపతిని వారివారి రుణ చరిత్రల ఆధారంగా మదింపు చేయడంలో సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్) సమాచారాన్ని ప్రధానంగా రుణదాతలు (బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలు) విశ్వసిస్తున్నారు. 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్లను సిబిల్ ఇస్తున్నది. రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర రుణ సదుపాయాల కల్పనలో వ్యక్తులు, సంస్థల అర్హతను నిర్ధారించడంలో ఈ స్కోరే కీలకం. అధిక స్కోర్ రుణగ్రహీతల ఆర్థిక పరిపుష్ఠికి నిదర్శనంగా నిలుస్తుంది. దీంతో రుణాలు సులభంగా లభిస్తాయి. పైగా తక్కువ వడ్డీరేటుకే దొరుకుతాయి. అలాగే స్కోర్ తగ్గితే రుణ లభ్యత అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటాయి. వడ్డీరేట్లూ ఎక్కువగానే పడుతాయి. సిబిల్ స్కోర్ 750, అంతకన్నా ఎక్కువగా ఉంటే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులను విరివిగా అందుకోవచ్చు. ఒకవేళ స్కోర్ 685 కంటే తక్కువగా ఉంటే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలిచ్చేందుకు వెనుకాడుతాయి. కాబట్టి ఆకర్షణీయ సిబిల్ స్కోర్ కూడా ఆర్థిక లక్ష్యాల్లో ప్రధానమే.

### స్కోర్ పెంపునకు మార్గాలు

#### సకాలంలో చెల్లింపులు

క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాల్లో సకాలంలో జరిపే చెల్లింపులు కీలకం. తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించడం, వాటి ఈఎంఐలను నిర్ణీత తేదీల్లో మిస్సవ్వకుండా చూసుకోవడం ముఖ్యం. పేమెంట్లలో ఆలస్యం క్రెడిట్ స్కోర్‌ను వేగంగా తగ్గించడమేగాక, డిఫాల్టర్ (ఎగవేతదారు లేదా మొండిబకాయి)గా మార్చే ప్రమాదమూ ఉన్నది. దీని వల్ల భవిష్యత్తులో రుణ సదుపాయాలను అందుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా గృహ, వాహన రుణాలు పొందడం పెద్ద సమస్యగానే పరిణమిస్తుంది.

#### పరిమితంగా రుణాలు

రుణాలను పరిమితంగా తీసుకోవడమే ఉత్తమం. మనకున్న రుణ పరిమితిలో దాదాపు 30 శాతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే క్రెడిట్ స్కోర్ బాగుంటుందని చెప్తున్నారు. సామర్థ్యానికి మించి ఉండే రుణ భారం వల్ల ఇబ్బందులు తప్పవు. కనుక అత్యవసరమైతే తప్ప రుణాల జోలికి వెళ్లకుండా ఉండటమే తెలివైన పని. అంతేగాక కీలకమైన గృహ రుణాల వంటి వాటికి అర్హత అనేది ఉంటుంది. కాబట్టి ప్రతీ చిన్న అవసరానికి అప్పులు చేయకుండా ఉండాలి.

#### అప్పుల అన్వేషణ వద్దు

కొత్త రుణాల కోసం తరచూ అన్వేషించడం కూడా మన క్రెడిట్ స్కోర్‌ను రిస్కులో పడేస్తుంది. రుణాల కోసం ఎక్కువగా వాకబు చేయడం వల్ల మన ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సంకేతాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు వెళ్తాయి. దీనివల్ల మన క్రెడిట్ స్కోర్ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్దకు వెళ్లి రుణాల కోసం ప్రయత్నించకండి. దానివల్ల రుణదాతలు మీ రుణ చరిత్రను పరిశీలిస్తూ ఉంటారు. పదేపదే ఈ పని జరిగితే అది మీకే నష్టం.

#### పొరపాట్లను సరిచేయాలి

క్రెడిట్ స్కోర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు మనం తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ ఆ సమాచారం క్రెడిట్ బ్యూరోకు ఉండదు. దానివల్ల మన క్రెడిట్ స్కోర్ పెరగకుండా ఉంటుంది. అలాంటప్పుడు రుణదాత (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. ఇక ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలా ఏజెన్సీలు ఉచితంగానే మనకు క్రెడిట్ స్కోర్‌ను తెలియజేస్తున్నాయి. కనుక తరచూ మన స్కోర్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం.




#### గ్యారంటీలకు దూరంగా..

గ్యారంటీలకు దూరంగా ఉండాలి. మనలో చాలామంది స్నేహితులనో, బంధువులనో, తెలిసినవారు లేదా ఇరుగుపొరుగువారంటూ వారి రుణాలకు పూచికత్తు సంతకాలు చేస్తూ ఉంటాం. కానీ ఇదంత శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ వారు తీసుకున్న రుణాలను చెల్లించకపోతే ఆ రుణ భారం మీ మీద పడుతుంది. ఆ రిస్కు పెరిగితే ఆటోమేటిగ్గా మీ క్రెడిట్ స్కోర్ సైతం క్షీణిస్తూ పోతుందన్న విషయం మరువద్దు. అందుకే తప్పని పరిస్థితుల్లో తప్ప వీలైనంత వరకు గ్యారంటీలకు దూరంగా ఉండాలి.

#### సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను పెంచడంలో దోహదపడుతాయి. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరి కాకుండా ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు మీరు చేసే డిపాజిట్ల ఆధారంగా లభిస్తాయి. పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారు వీటిని తీసుకొని మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు. మీరెంత నగదు డిపాజిట్ చేస్తే.. దానికి సమాన స్థాయిలోనే సదరు క్రెడిట్ కార్డు రుణ సదుపాయ పరిమితి ఉంటుంది. సకాలంలో కార్డు బిల్లులను చెల్లిస్తూపోతే స్కోర్ క్రమేణా పెరుగుతూపోతుంది.





# పిల్లల విద్య కోసం..

**పిల్లల** విద్య కోసం ప్రణాళిక అనేది తల్లిదండ్రులకున్న అత్యంత కీలక ఆర్థికాంశం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే వారి ఉన్నత విద్య ఖర్చుల కోసం పొదుపు చేయడం ఎంతో తెలివైన పని. అయితే అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

#### ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల కోసం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు సరైన నిర్ణయమనే చెప్పవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు.



#### హైబ్రిడ్ ఫండ్స్

హైబ్రిడ్ ఫండ్స్.. అటు ఈక్విటీల్లో, ఇటు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. వీటిలో రిస్క్, రిటర్న్స్ అనేవి సమతూకంగా ఉంటాయి.

#### విద్యా పథకాలు

వివిధ మ్యూచువల్ ఫండ్స్ పిల్లల విద్య కోసం రకరకాల పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి ఈక్విటీలు, రుణ లేదా బంగారాల్లో పెట్టుబడులు పెడుతాయి.

#### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

తక్కువ రాబడులను అందించినా.. సురక్షిత పెట్టుబడులుగా వీటిని చెప్పుకోవచ్చు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వీటిలో రిస్క్ ఉండదు. కచ్చితమైన రాబడులుంటాయి.

#### విద్యా రుణాలు

ట్యూషన్ ఫీజులు, రోజువారీ జీవన ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను ఈ విద్యా రుణాలతో అధిగమించవచ్చు. పిల్లల విద్య పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేలా మారటోరియం పీరియడ్‌కు వీలుంటుంది. అంతేగాక పాత పన్ను విధానం కింద ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80ఈ ద్వారా రుణగ్రహీతలు పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

#### బీమా ప్లాన్లు

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు.. అటు పెట్టుబడి, ఇటు బీమా సదుపాయంతో ఉంటాయి. ఒకవేళ పాలసీదారు దురదృష్టవశాత్తు చనిపోతే ఒకేసారి పెద్దమొత్తంలో కుటుంబీకులకు ధనసాయం లభిస్తుంది.

# ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?

**ఒక** కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.

#### ఈటీఎఫ్‌ల ద్వారా..

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.

#### ఈక్విటీ ఎంఎఫ్‌లు

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.

# ఒడిదొడుకుల్లోనే పయనం




దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,536.80 పాయింట్లు లేదా 1.98 శాతం ఎగిసి 79,117.11 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 374.55 పాయింట్లు లేదా 1.59 శాతం ఎగబాకి 23,907.25 దగ్గర ముగిసింది. ఆ మునుపటి వారం ఇంతకన్నా ఎక్కువ నష్టాలపాలైన సంగతి విదితమే. ఇక ఈ వారం విషయానికొస్తే.. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు చాలానే ఉన్నాయి. తీవ్రరూపం దాల్చుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికాలో అదానీపై కేసు, క్యూ2 జీడీపీ గణాంకాలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా చెప్పుకోవచ్చు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. దీంతో ఆటుపోట్లకు ఆస్కారం ఎక్కువగానే ఉన్నది. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,300-24,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




***గమనిక..:*** స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.